

# నాదంలో వేదం

... ఎ. శశికళ ...




"కలువ కన్నుల కురియు కాంతి వెన్నెల నేను
చిన్న నవ్వున తొణుకు సన్న వెన్నెల నేను
వన్నె చిన్నెల సొగసు కన్నె వెన్నెల నేను
పాదాల పొరలాడు పాల వెన్నెల నేను
తనువందు నెలవొందు తళుకు వెన్నెల నేను
నీలినీడల యాడు వేడి వెన్నెల నేను
మురళి పాటను మురియు మూగ వెన్నెల నేను
గోగు పూవున కదలు క్రొత్త వెన్నెల నేను
నెమలి ఈకను మెఱయు నెఱి వెన్నెలను నేను"

అని ఆనందంగా పాడుకుంటున్నట్లున్నది వెన్నెల. అల్లంతదూరం నుంచి రా రమ్మంటూ పిలుస్తున్నట్లుగా సాగి వస్తున్నది గానలోలుని మురళీరవళి.

ఆ పిలుపుకి అప్పుడే మేనువాల్చిన గోపిక మనసు మత్తున తేలింది. ఆ మత్తులోనే ఆమె లేచింది. ఆ గానం ఆమెను వివశను చేస్తున్నది. మనసు నిలువలేక పోతున్నది. తనువు తన్మయత్వంతో వూగిపోతున్నది. ఏదో ఆరాటం, ఏదో ఆవేదన, ఏదో ఆనందం ఆమె హృదయాన్నంతా ఆవరించుతున్నవి. ఆమెను ఆమె మరచిపోయింది. అంతకంతకు ఆ గానం ఆమెను మురిపిస్తున్నది, ముంచి వేస్తున్నది. ఇక నిలువలేకపోయింది. కన్నయ్యా! అంటూ ఒక్కసారి తలచుకుంది. అంతే! ఒక్క వుదుటున లేచింది. కానీ మాయ లోకాన్ని చూచి మనసు మూలిగింది. ఒక్కక్షణం లౌకికాలోచన ఒక్కడుగు వెనక్కు వేయించింది. ఆమె పెరటిదారిన వెనకనున్న అడవికి వెన్నునికై నడువ సాగింది. ఇంతలో పొన్నలు జల, జలా రాలాయి తొందరగా పొమ్మని సందేశం యిస్తూ. పిల్లగాలి చల్లగా పరుగు తీసింది — నీకన్నా నే ముందంటూ. విశాలగగనంలోని తెలి మబ్బు వేగంగా పరుగు తీసింది — పద మేం చూపుతాం నీ కృష్ణుని ఉనికి - అన్నట్లు. ఆమె వడి వడిగా ఆ తీయని రాగం వస్తున్న వైపు దారి తీసింది.

ప్రపంచమంతా గాఢ నిద్రలో ఆరాగ మాధురిలో మునిగిపోయి వున్న తరుణమది. ఆమె చెవులకు ఆ గాన రసంతప్ప మరే ధ్వనీ వినరాదు. ఆమె కన్నులు రసావస్థలో మూసుకొని పోయినవి. ఆమె తనువు ఆ గాన మాధురికి తీగలా వూగుతూ వుండగా ఆమె పదచరణాలు తమకు తెలిసినదారే అన్నట్లు బృందావనానికి తరలిపోతున్నాయి. ప్రియుని చేరబోవు అభిసారికవలె — పరమాత్ముని సన్నిధికి — ఆమె మనసు త్రోవచూప తనువుతో తరలి పోతున్నది.

ఆత్మ ఆమెకన్నా ముందే అతనిని చేరాలని ఆరాట పడుతోంది.

ఇంతలో ఆమె భుజం పైన బలంగా ఏదో పడింది. ఆమె ఉలికిపడింది. అంతా మాయ — ఆమె తిరిగి యీ లోకంలో పడింది. తన పయనం తలిదండ్రుల కెరకైందేమోనని తల్లడిల్లిపోయింది. తానున్న అవస్థకి తానే నివ్వెరపోయింది. వెనుదిరిగి చూడ వేడ్కలేక మిన్నకున్నది.

ఇంతలో చిన్న చిరుజల్లు పడింది — ఆమెను సేద దీర్చటానికన్నట్లు. పిల్ల తెమ్మెర ఆమెను తాకింది — స్పృహలోకి రప్పించడానికన్నట్లు. మరల భుజంపై స్పర్శ. కన్నయ్య తన వెనకాలే వున్నాడేమోనన్న వూహ మెదిలింది — ఒళ్లంతా పులకరించింది. తపనగా వెనుదిరిగి చూసింది మావి కొమ్మ. దాని ఆలంబనంతో పెరిగి విరబూసిన మాధవీ లత. ఓ....నువ్వా? చెలీ — మరచేపోయా నీ విషయం — అన్నట్లా మాధవునికి నీ సందేశం అందించాలన్నావు కదూ మొన్న — అపుడే నీకెలా తెలిసిందే పిచ్చీ? నేనటే పోతున్నానని? ఓ....యీ పిల్ల తెమ్మెర చెప్పిందా - సరే నీ విషయం తప్పక జ్ఞాపకం చేస్తాగానీ యిక నన్నొదులు చెలీ — అంటూ సున్నితంగా దాన్ని విడిపించి, అనంతాన్నంతా ఆవరించియున్న ఆ గానానికి తావలమైన పరమాత్మను వడి వడిగా వెతుకుతూ సాగిందామె.

వేగంగా పోవాలనుకున్న కొద్దీ అడుగులు తడబడుతున్నయ్. వెన్నుని వేడ్కలు వెన్ను తట్టి హుషారు చేస్తున్నయ్. అతని పెదవి నుండి వేణువుకి, దానినుండి ప్రపంచానికి జాలువారుతున్న గానవేగం మరింత విజృంభించింది — హృదయం లయ తప్పుతున్నది. పరవశమైపోతున్నదామెకు. ఒక్క క్షణం



## ఏ నవల చదివినా...

ఏ నవల చదివినా ఏముంటుంది జ్ఞాపకం? ప్రతి కథలోనూ త్రికోణ ప్రేమాయణం—అన్పిస్తున్నది.

ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లు, లేదా, ఇద్దరు హీరోలు, ఒక హీరోయిను. ఈ త్రికోణపు ప్రేమ ఆఖరున ఒకరి త్యాగంతోనో, మరొకరి చావుతోనో ముగుస్తుంది. దీనివల్ల సంఘానికి జరుగుతున్న సాహిత్య సేవ ఏమిటి? ఈ అసంఖ్యాక నవలల ప్రచురణ ఎవరికోసం?

సామాన్య పాఠకుల్ని అలరించటం కోసమే అయితే....నిత్యావసర వస్తువుల ధరలతోనే సతమత మయ్యే నగటు మనిషి ఒక్కొక్క పుస్తకం 12 రూ॥లు, 15 రూ॥లు పెట్టి కొనగల స్థితిలోనే వున్నాడా?

ఒకటి రెండు సంస్థల ప్రచురణలు తప్పితే తక్కిన వారెవరివీ అందుబాటులో వుండటంలేదు. సామాన్యునికి కూడా సాహిత్యాభిలాష కల్గించి, ఇంటింటికో స్వంత గ్రంథాలయాన్ని ప్రవేశపెట్టిన ఎమెస్కో వారిలా పుస్తక ప్రచురణ కర్తలు చెయ్యగలిగితే, అది నిజంగా విశిష్టమైన సేవ కాగలుగుతుంది.

ప్రచురణ సంస్థ మీద అభిమానంతోనో, వ్రాసిన వాళ్ళ మీద ఆరాధనతోనో పాతిక రూపాయలు పెట్టి రెండు పుస్తకాలు కొంటే (పాతిక రూపాయల కొస్తాయా?) ఆ రెండింట్లోనూ ఒకే వర్ణన, ఒకటే మాటలు, కథావస్తువు గూడా దాదాపు ఒకటిగానే అన్పిస్తుంది.

ధనవంతుడు పేద అమ్మాయిని పెళ్ళిచేసుకోవటమో, బీదవాడు, డబ్బున్న అమ్మాయిని ప్రేమించటమో, పెళ్ళి కాకుండానే తల్లులు కావటమో, భార్యాభర్తలు, చిన్న మాట పట్టింపుతో చివరిదాకా విడిగా వుండి, ఆఖరి పేజీలో కలుసుకోవటమో-ఇవి తప్పితే నవ్యతా వుండటంలేదు; నాణ్యతా వుండటంలేదు. ముందు పదిపేజీలు చదివి ముగింపు ఊహించి చెబుతున్న పాఠకులు గొప్పవాళ్ళా? వాళ్ళల్లో అంత ఆలోచనాశక్తిని పెంపొందింప చేస్తున్న రచయితలు గొప్పవాళ్ళా?

అప్పుడప్పుడు చక్కటి కథలు చదివి తృప్తి పడటం జరుగుతున్నది కాని...గుర్తుంచుకోదగ్గ పుస్తకాలు మటుకు రావటంలేదు.

ఈమధ్య వచ్చిన కొన్ని నవలల్లో కథానాయకుడికి రెండు పెళ్ళిళ్ళు జరిపించేస్తున్నారు. అది చట్ట రీత్యా తప్పని తెలిసి కూడా మగవాడికి ఇద్దరు, ముగ్గురు భార్యల్ని కట్టబెట్టి సంతోషపడుతున్న మన రచయిత్రు(త)ల్ని ఎలా అభినందించాలో తెలియకుండా వుంది.

నవలలు చదివి సినిమాలు తీస్తున్నారో, ఎవరు ఎవర్ని కాపీ కొడుతున్నారో ఆలోచిస్తుంటే అదొక వలయంగా తోస్తున్నది.

కార్టూన్‌కి సరిపడేదాన్ని కథగా మార్చటం, ఆ కథని సాగదీసి, సాగదీసి నవలగా మలచటం చూస్తుంటే....'కండపుష్టి సాహిత్యమా నీకు జోహార్!' అనాలన్పిస్తున్నది.

కాలక్షేపానికే అయినా పుచ్చువి తీసేసి, మంచి బతాణీలే ఎలా తింటామో, టైము గడవటానికే పుస్తకాలు చదివినా, అవి సత్కాలక్షేపం కల్గించాలని బాగున్న నవలలే ఎంచుకోవటం-నేటి పాఠకుల్లో వస్తున్న మంచి మార్పు. ఈ తేడాని రచయి(త)త్రులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

ఆధునిక సాహిత్యమంటే విసుగెత్తిన పరితలు పూర్తిగా విరక్తి చెందక మునుపే మారుతున్న చదువరుల అభిరుచి గ్రహించి, చక్కటి సాహిత్యాన్ని అందచేయాల్సిన సాంఘిక బాధ్యత రచయిత్రు(త)లదే! —జయశ్రీ

---

నిలచి సేద తీర్చుకోవాలనుకున్నది. కానీ ఆ మురళీరవళి ఆమెను నిలువనీయటం లేదు. ఆమె ఆగలేక మరింత వేగం పెంచింది—ఆమె కన్నులు ఆ మాధుర్యంలో మునిగి ఆనందబాష్పాలు స్రవిస్తున్నవి. కనులు మసకబారగా బాట అగమ్యమౌతోంది. అయినా ఆమె ఆగలేదు. ఆ గానం ప్రవాహంలా అగ్రస్థాయినందుకుంటూ లోయల్లో పడుతూ, మలుపులు తిరుగుతూ మరిన్ని మాయలు చేస్తూ ఆమె మనసును అంతుతెలియని ఆనందంలో ముంచివేస్తున్నది. ఆ గానమాధుర్యంలో ఆమె కొట్టుకొనిపోయింది.

ఎలాగైతేనేం యమునా తీరానికి చేరుకుంది. ఆ ప్రదేశానికి దగ్గరైన కొద్దీ వేణుగానం చుట్టూ అలముకుంటున్నది. ఎటుపోవాలి? ఏ వైపు కృష్ణుడున్నది? ఏదీ? నా జగత్ప్రభువు నిలయమైన పొగడచెట్టు? ఎక్కడ నా స్వామి? అంటూ వెర్రిగా వెతుకుతూ వేసారిపోయింది. ఇక నడువలేక అలసి, అలమటించి ఆగిపోయింది. కన్నయ్య కనబడలేదు. కన్నీరు మున్నీరుగా సాగింది—అక్కడే పొన్నచెట్టు బోదియ మాని కూర్చుంది. మనసంతా ప్రభుమయమైపోయింది. ఇక నీవే శరణు నీరజాక్షా! అంటూ అలవిమాలిన వేదనతో తెలివితప్పి పడిపోయింది. అంతవఱకూ ఆమెను గమనిస్తూ అదే చెట్టుపైనున్న మాధవుడు గానాన్ని ఆపి చూచాడు. ప్రభువు హృదయంలో జాలి వెల్లువలా పొంగింది. జీవుల హృదయాలు స్పందించేలా పాడిన తన మురళిని ముద్దుగొన్నాడు. చెట్టు దిగి వచ్చాడు. అలసిసొలసిపడిన ఆమె మోమును చేతులతో నిమిరి అలకలు సవరించాడు. అతని యీ స్పర్శకే ఆమెకు సగము ప్రాణము వచ్చినది. తిరిగి మురళి నందుకుని ఆమె చేరువనే గాన మారంభించాడు. ఆమె కనులు తెఱచి చూచింది—

అంతకంతకు జగమంతా వెలుగులు నింపుతూన్న ఆ విశ్వప్రభుని కనులారా చూచింది. తనివితీరలేదు. రెప్పలనార్చుట మరచినది. ఒడలెల్ల కనులు చేసికొని చూచినది. ఆమెకు సత్యము గోచరమైనది. ప్రభువామెలోని యీ మార్పును గమనించాడు. తన గానము నాపినాడు.

కన్నయ్యా! అంటూ ఏదో ఆత్రుతగా, ఆర్తిగా చెప్పబోయిన దామె—కానీ, ఆలోచనాస్రవంతిలో పరధ్యానంగా తననే పరికిస్తున్న వెన్నునికి ఏమీ చెప్పలేక ఆగింది. అంతలో మళ్ళీ కన్నయ్యా! అని పిలిచింది. ఏమిటి? అన్నట్లు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో కురిసిన వెన్నెలని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయినదామె. అతను బుజ్జగింపుగా వెన్ను తట్టి చెప్పమన్నాడు. మరేమోనూ—మావి గున్న, మల్లెతీగ, లేగదూడ, పూలబాల నీగానానికి తన్మయులై నీ కోసం వేచి ఉన్నాయని చెప్పమన్నాయి—అంటూ అమాయకంగా చెప్పింది. అయినా నువ్వే వాటిని కదలకుండా చేశావుగా—అని నింద మోపింది. పాపం—అంటూ వాటిపై జాలి చూపింది. అన్నీ విని కన్నయ్య నిర్మలమైన ఆమె మోమును చూచి మరింత నిర్మలంగా నవ్వాడు—ఆమె అమాయకత్వానికి, అదే ఆమెకు జవాబన్నట్లూను.

ప్రభువు ప్రేమ—గానరూపంలో మనసున్న వారిని వశీకరించి, పరామర్శించి పోతుందని మామూలు హృదయాల కెలా తెలుస్తుంది? □